# మనసా! ఎటులోర్తునే...

కుమారి ఎ. వి. శేషారత్నం



"మనసా ఎటులోర్తునె ........"

ఆ నిశీధిలో ఏటి మీంచి మెల్లమెల్లగా అలలు అలలుగా సాగి వస్తున్న మలయమారుతం శ్రోతల మనసులనే వో దూర తీరాలకు తీసుకుపోతోంది. మనసు మూలల అగాధపుటంచుల్ని తాకుతోంది.

ఆ కంఠంలోని ఆర్తికి బండరాళ్లు సైతం వేడి తగిలిన వెన్నలా కరిగి ప్రవహిస్తున్నాయి. నాగస్వరం వింటున్న నాగుపాముల్లా ఉన్నారు జనం.

కానీ ఈ క్షణంలో ఆ గానం నాకేమాత్రం సాంత్వన కలిగించడం లేదు.

నా హృదయంలో ప్రచండాగ్ని రగులుతోంది.

మనసు దావానలంలో దగ్ధమైపోతూంది.

ప్రపంచాన్ని తగలెయ్యాలనే కసి —

కాని —

నా నిస్సహాయత్వం మీద నాకే చెప్పలేనంత జాలి, అసహ్యం కలుగుతున్నాయి.

చెప్పలేనంత నీరసం నిస్సత్తువా నన్నావహించాయి. తల తిరుగుతున్నట్టుంది. లేచి వెళ్దామన్నా నుంచోలేనంత బలహీనత. ఒక విధమైన మత్తులో నా మనస్సు జోగుతోంది.

అదిగో యమునా నది — పరవళ్లు తొక్కుతూంది.

ఉధృతంగా ప్రవహిస్తూ —

అక్కడ కృష్ణుడు వేణుగానాన్ని ఆలపిస్తున్నాడు.

నీలమేఘచ్ఛాయ— నెమలిపింఛం— ఎర్రని అతని పెదవుల నుంచి మాధుర్యం మురళిలోకి ఒలికి ధారలై ప్రవహిస్తోంది. ఆలమందలు మోరలెత్తి అరమోడ్పు కన్నులతో ఆర్తిగా చూస్తున్నాయి. యశోద పరుగున వస్తోంది అంత దూరాన విన్న మురళీ రవాన్ని ఆధారం చేసుకుని.

కాని ఆ మధురగానానికి పరవశిస్తూ ఆమె నేత్రాలు అలవోకగా నిమీలితమయ్యాయి.

ప్రళయకాల గర్జనలా కెరటాల హోరు — నింగీ నేల ఏకమైనట్లు చప్పట్లు మారుమోగిపోయాయి.

ప్రశాంత గంభీర వదనంతో చెరగని చిరునవ్వుతో చేతులు జోడిస్తున్నాడు ప్రకాశం వినయంగా సభకి —

నా మనసు చెదిరి యమునానదీ తీరాన దృశ్యం చెరిగిపోతోంది. చెవుల్లో హోరు.

ఉధృతంగా ప్రవహిస్తూ యమునానది:

మురళీగానం వినిపిస్తోంది కాని —

కృష్ణుడు లేడక్కడ.

ఆవేదనతో ఆ గానాన్నాలంబన చేసుకుని వెతుకుతున్నాను నేను పిచ్చిదానిలా.

'అమ్మా !'

చిన్నీ !

నా మనసు ఆనందంతో ఉరకలు వేసింది. కళ్లు బలవంతాన తెరిచాను. చిన్ని లేడక్కడ.

ప్రకాశం ఆప్యాయంగా చెయ్యితట్టి లేపుతున్నాడు.

"కాన్సర్ట్ అయిపోయింది. పద సంధ్యా!"— షాల్ కప్పాడు భుజాలచుట్టూ.

చుట్టూ చూసాను. జనమంతా వెళ్లిపోయారు. హాలు ఖాళీ అయింది నా మనసులాగే.

"మలయమారుతానికి బాగా రెస్పాన్స్ వచ్చింది కదూ! నువ్వుకూడా ఏదో లోకాల్లో తేలిపోతున్నావు. దొంగా! క్షేజిమించి నేను గమనిస్తూనే ఉన్నాను. నా గానం నీకంత ఇష్టమా సంధ్యా" — అతని కంఠంలో తృప్తి, అతని చేతిలో నా చెయ్యి ఇమిడిపోయింది.

"నువ్వీరోజు చాలా నీరసంగా ఉన్నావు. మనం హోటల్లో భోంచేసి వెళ్దాం. వంటగోల ఉండదు. సంధ్యా! సంగీత సమితి ప్రెసిడెంటు మనిద్దర్నీ భోజనం చేసి వెళ్లమని పట్టుబడినా నేను ఒప్పుకోలేదు. ఎందుకో తెలుసా? నీ కళ్లల్లోకి చూస్తూ తినే అదృష్టం ఉండదని. ఏం సంధ్యా మాట్లాడవు ?"

'నా కాకలి లేదు'— ఈ మాట పైకి నేను అనలేను. అంటే అతనినెంత అప్‌సెట్ అవుతాడో తెలుసు. తెలియనిదల్లా ఒక్కటే— నన్నింత అపురూపంగా చూసుకుంటాడే— నా రక్తంలో రక్తం చిన్నిని...భగవాన్...

ప్రతి వ్యక్తిలోనూ రంగురంగుల ఇంద్ర

మనుస్సులా కోరికలూ, ఆదర్శాలూ ఉంటాయి. ప్రేమనిమించే అసూయ, దాన్ని మించిన త్యాగం అభిమానం వెనుక క్రౌర్యం అన్నిటినీ త్రోసి రాజనే ఆప్యాయతా అన్ని అనుభూతులూ ఈ చిన్న జీవితంలో ఇమిడే వున్నాయి. కాని అవి సరైన మార్గంలో ఉపయోగించుకున్నవాడు జీవితం ఆనందమయం. కాకపోతే -

ప్రకాశం ! నీ మనసులో చిన్నికి కూడా చోటిస్తే— ఈనాడు నాకీ వేదన తప్పేది. కాని తప్పంతా నాది.

స్త్రీకి మాతృత్వాన్ని మించిన వరం లేదు. కాని నేను స్వార్థం ముందు మాతృత్వాన్ని బలి పెట్టాను . ప్రకాశం అడిగిననాడే మరికొంత ఆలోచించి వుంటే... ఊహూ ! అది వయసు, ఉరకలెత్తే వయసు.

కళ్లెం వేసినా ఆగని కోరికలు.

కాదు— కోరికలకోసం కాదు నేను తల వంచింది.

లోకంలో ఒంటరిగా బ్రతకలేకా—

బ్రతకలేకకాదు— బ్రతకనివ్వని లోకానికి భయపడి— ఆలోచిస్తే అవకాశం జారిపోతుం దేమోననే తొందరపాటుతో— ఆనాటి సంఘటన నా మనో ఫలకంమీద ప్రతిబింబించింది.

“సంధ్యా !”

“ఊ !”

“ఎంతసేపలా పరుగులెత్తే మేఘాలను చూస్తావు ? మేఘాలను తప్ప మరేం చూడవా? నిన్ను కోరుకునే మనిషినెపుడు చూస్తావు సంధ్యా ? నాకెన్నాళ్లీ పరీక్ష? ఫోనులో అనుక్షణం నీ కంఠం వినాలని తహతహ లాడతాను కాని గడియ గడియకీ ఫోన్‌చేసి నీ ఉద్యోగానికి భంగం కలిగిస్తున్నాననే భయం. కాని నీ కంఠం వినకుండా ఉండలేని దౌర్బల్యం. ఒక్కొక్కప్పుడు నీకు కష్టం కలిగిస్తున్నానని తెలిసీ నా స్వార్థం కోసం ...”

## మనసా ! ఎటులోర్తునే....

లోకమే స్వార్థపరులతో నిండిపోయింది. అవకాశం దొరికితే అందితే అందరికీ నన్ను సొంతం చేసుకోవాలనే స్వార్థం. కాని ఆ స్వార్థం నా మెడలో పసుపుతాడు వెయ్యనీయదు. నా మీద జాలి, సానుభూతి చూపించి నా మెడకి ఉరితాడు నేస్తుంది— నా ఆలోచనలు ప్రకాశానికి చెప్పలేదు.

“ఏంటి సంధ్యా ఆలోచిస్తున్నావు? ఏమిటీ పిచ్చివాడు అనా ? నీ ముఖభావాన్ని అతిశయం గామూ గర్వంగాను తీసుకుని నిన్నపార్థం చేసు కుంటాననుకున్నావా ? ఊహూ ! స్వభావ సిద్ధంగానే నువ్వు నిశ్శబ్దాన్ని, ఏకాంతాన్ని ఇష్ట పడతావని గ్రహించగలిగేది నేను మాత్రమే. నీ కోసం ఎన్నాళ్లు ఎదురుచూడమంటావు ? ఒక జీవిత కాలమా ? నేను రడీ. కానీ ఎందుకు జీవితాన్ని వృధా చేసుకోవాలో చెప్పు !”

‘నా జీవితం వృధా అయిందని నీకెలా చెప్పాలి ప్రకాశం? ఇంత ప్రేమను కురిపిస్తున్న నువ్వు—నేను అఘ్రాణిత పుష్పాన్ని అని తెలిస్తే సహిస్తావా ? నిండు హృదయంతో నన్ను స్వీకరిస్తావా ? జాలితో అయితే వద్దు. నేను జీవితంలో సహించలేని వస్తువు ఒకే ఒకటుంది. అది ఇతరుల సానుభూతి. అంతకంటె నన్ను చిత్ర వధ చేసినా భరిస్తాను.’ — నా ఆలోచనలు నన్నెలా మొదలు పెట్టనివ్వాలో చెప్పడంలేదు.

‘సంధ్యా! నీ మౌనాన్ని అనంగీకారంగా తీసుకోవాలా ? నా దగ్గర ఎందుకా మౌనం ? అనేక అపార్థాలకు దారితీస్తుంది. మనసు విప్పి మాట్లాడితే నేను నిన్నింకా అర్థంచేసుకోగలను. నాకా అవకాశం ఇవ్వడానికి ఎందుకు సందేహిస్తున్నావు ? నేను మోసగాడి ననుకుంటున్నావా ? నా గుండె చీల్చి చూడు. ప్రతి రక్తబిందువూ ‘సంధ్యా’ అని పరితపిస్తుంది.

అసలు నాకెందుకు కనిపించావు సంధ్యా ?

### మానవుడు

మృగంలో మృగత్వం
దైవంలో దైవత్వం
పూవులో తావి ఉన్నట్లు
అయితే
మానవుడిలో నెలకొన్నాయి
మృగత్వ దైవత్వాలు
మానవత్వంతోపాటు.
అందుకే అతడు మిన్న
అందరికన్న.


— చల్లా రాధాకృష్ణశర్మ


ఆనాడు సభలో అంతమంది ప్రేక్షకులలో నా దృష్టి నీమీదే ఎందుకు పడింది ? సంగీతం అంటే నీకుండే అభిమానమో — నా గాత్రంలో ఉండే గొప్పతనమో నా కర్థంకాలేదు. మలయ మారుతాన్ని ఆలాపిస్తున్నంతసేపు కళ్ళు మూసుకున్న నా మనోవీధిలో నువ్వే అర్ధ నిమీలిత నేత్రాలతో తపోధ్యానంలో ఉన్న సతీ దేవిలా కనిపించావు. నువ్వు ఆపరేటర్‌గా పని చేస్తున్నావని తెలుసుకోడానికెంత కష్టపడ్డానో, నీతో స్నేహం పెంచుకోవాలని ఎంత తాపత్రయ పడ్డానో నీకు తెలుసు.” ప్రకాశం స్వరం మంద్ర స్థాయిలో ఏదో లోకంలోంచి మాట్లాడు తున్నట్లుంది

ఆ రోజు నాకూ గుర్తుంది. నాకు సంగీత జ్ఞానం లేదు — బొత్తిగాలేదు. అయినా చిన్నప్పట్నుంచీ సంగీతమంటే నాకెంతో యిష్టం. సరిగమ పదని — సప్తాక్షరల్లోనే సంగీతమంతా ఇమిడి ఉందంటే నాకెంతో ఆశ్చర్యంగా ఉండేది. ఆ అక్షరాలనుంచే ఎన్నో రాగాలు, స్వరాలు — అద్భుతంగా పలుకుతోంటే మానవ జీవితానికి ఆ సప్తాక్షరాలకీ ఏదో సంబంధం ఉందనిపించేది. స్వరకల్పన చేతనయితే ఎంత విషాదరాగమయినా మనసునేదో తెలియని లోకాలకు తీసుకుపోతుంది. జీవనరాగమూ అంతే. స్వరకల్పన చేతకాకపోతే జీవితం అపస్వరాల పుట్ట అయిపోతుంది.

ఏ స్వరాన్ని ఏస్థాయిలో ఎక్కడ పలికించాలో తెలియకపోతే స్వరం నాశనం. వికృత రాగం అయిపోతుంది.

చిన్నప్పట్నుంచీ నాకేం కావాలో నాకే తెలియదు. ఒక్కక్షణం నా అవసరం ‘ఇదే’ అనుకున్నా ఏదో తెలియని పిరికితనం— ఎవర్ని ఎదిరించగల ధైర్యంలేని నేను సమాధానపడి పోవటంలోనే జీవితాన్ని గడిపేస్తున్నాను.






# మనసా ! ఎటులోర్తునే....

నాకు 'రామం' అంటే అయిష్టంలేదు. మేనరికం— గుండెలమీద కుంపటి దించుకోవాలని అమ్మా నాన్నా పెళ్లి చేసేస్తే ఏమూలో ఉన్న రవంత అయిష్టాన్నీ వ్యక్తపరచలేదు.

'పెళ్లి చేసుకోక ఏం చేస్తావు ?' అంటే సమాధానం నా దగ్గరలేదు. అందుకే పద్దెనిమిదేళ్లకే 'రామం' ఇల్లాలినయ్యాను. మరో రెండేళ్లకే 'చిన్ని'కి తల్లినీ అయ్యాను.

అనుకోని అశనిపాతంలా అమ్మా, నాన్న, అతనూ ప్రమాదంలో కళ్లు మూస్తే లోకంలో 'చిన్ని'తో ఒంటరిగా నిలబడిపోయాను.

దూరపు బంధువు దయతో ఉద్యోగంలో చేరాను. కానీ నేను ఒంటరిదాన్ని అని తెలిసిన మరుక్షణనుంచే లోకం వేటకుక్కలా నన్ను వెంట తరుముతూనే ఉంది.

నన్నెలా రక్షించుకోవాలో తెలియని సందిగ్ధంలో నానా మానసిక చిత్రహింసా అనుభవిస్తున్న నాకు వరమో శాపమో ప్రకాశం తారసిల్లాడు..

జీవితంలో నేను ఇష్టపడింది— చేసింది— కచ్చేరీలకి వెళ్లడమే. చిన్నప్పుడు విసుక్కుంటున్నా అమ్మ తోడు వచ్చేది.

'రామం' రానపుడు రేడియో వినేదాన్ని, ఇపుడు 'చిన్ని' తోడు.

వాడే లేకపోతె నా జీవితానికి అర్థమే లేదు. ఒంటరిగా జీవితం గడుపుతున్నానూ— గడప గలుగుతున్నానూ అంటే 'చిన్ని' కారణం. వాడే లేకపోతే ఈ అపస్వరాల పుట్ట అయిన జీవితాన్ని ఏ అర్థరాత్రో అంతం చేసుకునేదాన్ని.

గయ్యాళి భార్య భయంతో ఆగినా — అవకాశం దొరికినప్పుడల్లా వంకర చూపులు చూసే ఇంటాయనని చూసీ, — యుక్తాయుక్త విచక్షణ లోపించి నా జీవితం మీద జోకు లేసుకుని- అందితే ఆస్వాదించి కాలరాయాలని కాచుకునున్న కాలభైరవుల్ని తలుచుకుని చచ్చిపోవాలనిపించేది కానీ— కన్నపేగు— మమకారం...

'సంధ్యా!' ప్రకాశం పిలుపులో స్వార్థం కాదు— నేను నిజంగా కావాలనే ఆర్తి

''ప్రకాశం ! బిడ్డతల్లిని భార్యగా స్వీకరించ గల ధైర్యం నీకుందా'' - బాణంలా తగిలిందతనికి నా ప్రశ్న, ఒక్క క్షణం లేడిలా గిలగిలలాడిందతని మనస్సు.

ఆ రోజుతో మా స్నేహానికి స్వస్తి అనుకున్నాను. కాని మర్నాడు బొమ్మలతో, బిస్కెట్ పాకెట్‌లతో మా యింటికొచ్చిన ప్రకాశం మనసు నాకు తెలిసిందనుకున్నాను.

వయసు పోరుతో కాదు— లోకాన్నెదుర్కోలేని నిస్సహాయతతో కాదు.

'నాన్న' ఏడని బుల్లినోరు తెరిచి అడిగే చిన్ని కోసం— చిన్ని కోసమే నేను ప్రకాశాన్ని అనుసరించాను.

సుఖాలను డబ్బుతో కొనుక్కోవచ్చు —
కానీ సంతోషం మానసికమైనది.

ఒక స్త్రీ భర్తనుంచి భౌతిక సుఖాలకన్నా ఎక్కువగా మానసికమైన అనుభూతుల్నే ఆశిస్తుంది. 'తనది' అన్నవన్నీ అతని పరం కావాలనే కోరుకుంటుంది.

కానీ పురుషుని ప్రపంచం వేరు. అతనిదెక్కువ భౌతిక దృష్టి, కళాకారుడైనా ప్రకాశమూ అంతే.

అతను నన్ను ప్రేమించడంలో అణుమాత్రం లోటుచెయ్యడు. నా తనువూ, మనస్సూ అతనికే అర్పితమవ్వాలి. మరే ప్రాణికీ అందులో హక్కుండకూడదు. అతని కోరికలో నామీద అనంతమైన ప్రేమ వాహినిలా పొంగుతున్నా నాలో 'భార్య' అనేదానికి మించి 'మాతృత్వం' అవిరళంగా ప్రవహిస్తోంది.

అతని భార్యగా అతనికి సంపూర్ణమైన సహకారాన్నెలా అందించాలనుకుంటున్నానో తల్లిగా 'చిన్ని' కోరిక తీర్చడమూ నా విధే.

'నాన్నా' — అనే అమాయకపు 'చిన్ని' పిలుపుకు తండ్రికాని అతని పితృ హృదయం వరదలై పొంగాలన్నంత స్వార్థం నాకు లేదు. కాని తండ్రి ప్రేమ కోసం తపించిపోతున్న వాడికి రవంత తృప్తి దొరికితే నా జీవితం మోహనరాగమవుతుందనుకున్నాను..

కాని చిన్ని పిలుపు విన్నప్పుడల్లా అతనికి తెలియకుండానే అసంకల్ప ప్రతీకారచర్యగా అతని కనుబొమలు విరిగేవి. ఏదో అపస్వరం దొర్లి వికృతరాగంగా మారేది. పైకి వ్యక్తం కాకున్నా, నామీది ప్రేమచాటున అణిగిపోవాలన్నా నా సునిశిత దృష్టిని దాటిపోలేని విషయమది.

తల నెరిసిపోయిన గురువు శిష్యుడెంత గొప్పవాడైన అతని గొప్పదనం మీదకంటె తప్పొప్పుల నిర్ణయంవైపే అతని మనసు మొగ్గుతుంది. ఎందుకు ? శిష్యుడు మచ్చలేని మాణిక్యంలా మెరవాలనే. నేను కోరుకున్నదీ అదే.


చిన్నికి మాలిన్యంలేని ప్రేమ దొరకాలి.

వాడొక రాత్రివేళ కలత నిద్రలో 'అమ్మా' అని భయంతో ఏడుస్తుంటే నా చుట్టూ బిగుసుకున్న ప్రకాశం మమతానురాగాల్ని బలవంతంగా తెంచుకుని నా మాతృహృదయం పరిగెడుతుంటే —చేతుల సడలింపులో 'చిన్ని' పట్ల కోపం కదలాడితే నా మనసు విలవిలలాడేది.

అందుకే నేను నిర్ణయించుకున్నాను.

ఆ రోజు ...

చిన్నిని బోర్డింగ్ స్కూల్లో వదిలిపెడుతూంటే నా మాయమాటలు నమ్మి, లేగదూడలా వాడు చూస్తున్న చూపు నా గుండెల్ని చీల్చింది.




**జె. – కొవ్వూరు.**

నాకు చిన్నప్పటి నుంచి చవి చీము కారుతూ ఉంది. ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేదు. ఇ. ఎన్. టి. సి స్పెషలిస్టుకి చూపించాము. టాన్సిల్స్ ఆపరేషన్ చేసి 1 సం. అయింది.

★ మిడిల్ ఇయర్ ఇన్ఫెక్షన్ వచ్చిన వారికి ఇలా నిరంతరం చీము కారుతూ ఉంటుంది. ఈ చీము మాస్టాయిడ్ అనే ఎముక భాగానికి ఎస్తరించకుండాచూడవలసి ఉంది.

చెవు భాగాన్ని ఎక్స్–రేతీయించి వైద్యులకు చూపించవలసి ఉంటుంది. చెవులో నుంచి వచ్చే చీముని కల్చర్–సెన్సిటివిటీ టెస్టు చేయించి ఫలితం ప్రకారం యాంటీ బయాటిక్ మందులను స్థానికంగాను. ఇంజక్షన్ల రూపంలో ను వాడవలసి ఉంటుంది.

**జి. ఆర్. ఆర్. – హొస్పేట**

నేను ఇప్పటికి రెండు నెలల క్రితం ఒక వేశ్యతో కలిశాను. ఆ తర్వాత ఒక వారం రోజులకి నా లింగం ముందు భాగం చాలా దురద పెట్టింది. ఇప్పుడు కూడా చర్మం లోపలి భాగంలో చిన్న చిన్న, అంటే రాగి గింజలంత మోతాదులో తెల్లని గుల్లలు ఉన్నవి. డాక్టర్ని సంప్రదించాలంటే సిగ్గుగా ఉంది.

★ మీరు వైద్యులని తప్పక సంప్రదించవలసి ఉంది. వారు పరీక్ష చేసి టెట్రాసైక్లిన్, స్ట్రెప్టోమైసిన్, సల్ఫా వంటి మందులు వాడిగాని, పరిస్థితిని బట్టి జిడాక్స్ వంటి మాత్రలు వాడిగాని నయం చేయగలరు.

**ఆర్.ఆర్.బి. – న్యూఢిల్లీ**

కుష్టు రోగం వస్తుందేమోనని చాలా భయపడుతున్నాను. అసలు ఈ రోగం రాకుండా ముందు జాగ్రత్తలు కోసం ఏమైనా మందులు వున్నాయా?

★ కుష్టురోగం రాకుండా ప్రత్యేకంగా తీసుకో తగిన ముందు జాగ్రత్త లేమీలేవు.

ఈ రోగం ఒకరి నుంచి మరొకరికి ఎలా సంక్రమిస్తుందనేది ఇంకా తెలియని విషయం.

ఈ రోగ నివారణకి గాను వాక్సిన్ తయారు చేయటానికి పునః పరిశీలనా కార్య క్రమాల సన్నాహాలు జరుగుతున్నాయి. వీటి ఫలితాలు కొన్ని సం.ల వాడుక తర్వాత గాని తెలియవు. □

---

పులికి ఆహారం కాబోతూ, గిడ్డకు నీతులు చెప్పి తిరిగివస్తానన్న గోమాతను లేగదూడ అలాగే నమ్మి ఉంటుంది.

"నన్ను వదిలి నువ్వు అంతదూరం ఎందుకు వెళ్ళాలమ్మా" అని ప్రశ్నించలేని వాడి బాల్యం నాకు అలుసయింది.

"నాన్నగారి కోపం తగ్గాక పెద్దవూరు నుంచి త్వరగా వచ్చేసి తీసికెళ్తావ్ కదూ !"

నేనెప్పటికీ తిరిగిరానని, వాడిని అనాధ బాలుడిగా ఆ స్కూల్లో చేర్పి ఒక తల్లి తన స్వార్థం కోసం తనని జీవితాంతం ఒంటరివాడిని చేసింది అన్న కఠోర సత్యం వాడికి తెలిసిన రోజున వాడు మాతృత్వాన్నే శపిస్తాడని నాకు తెలుసు.

కానీ నేనింటికి వెళ్లిపోయాను గుండె బండ చేసుకుని. ఆ రోజు ప్రకాశం ఆఫీసు నుంచి తిరిగివచ్చి 'నాన్నా' అన్న బాబు పిలుపు వినిపించకపోతే తేలిగ్గా నిట్టూరుస్తుంటే అతని భారాన్ని తీర్చిన నా భారం మరింత అధికమయింది. సంగీత జ్ఞానం లేకపోయినా ఇప్పుడూ ప్రకాశం కచేరీలకి హాజరవుతూ ఆ రసజలధిలో మునిగి తేలాలనుకుంటాను. కాని అతను పాడుతున్న ప్రతి రాగంలోనూ ఏదో స్వరం లోపించినట్లనిపిస్తోంది.

'సంధ్యా' — మృదువుగా నా చెంపలు సవరిస్తూ —

'భోజనం వచ్చేసింది. ఆకలి లేదంటే నేనొప్పుకోను, నీకోసం కాదోయ్. మరో మూడు నెలల్లో బయట ప్రపంచాన్ని చూసే బుల్లి సంధ్యారాణి కోసం.' హోటలని కూడ మర్చిపోయి తినిపిస్తున్నాడు ప్రకాశం.

నా కంట కావేరి కట్టలు తెంచుకుంటున్నా బలవంతాన ఆనకట్ట వేస్తున్నాను. అతని ప్రేమను తట్టుకోలేక నా మనసు భోరుమంటోంది.

'త్వరగా తినేస్తే నీకో గమ్మత్తు చూపిస్తాను'— నన్ను పసిపిల్లలా లాలిస్తున్నాడు ప్రకాశం.

ఆటో దిగి గుమ్మంలో అడుగుపెట్టగానే పసిపిల్ల చేతుల్లోంచి చేపపిల్లలా జారిపోతూ — 'అమ్మా !'

మూడు నెలలుగా నాలోనే సుడులు తిరుగుతున్న పిలుపు — నాకు మతిభ్రమిస్తోందా ? కలగంటున్నానా ?—

"నాన్నగారికి నామీద కోపం అని అబద్ధం ఎందుకు చెప్పావు ? నాన్న నేను జట్టు. కదు నాన్నా — ప్రకాశం మీదికెగ్రపాకాడు 'చిన్ని'.

వాడిని ముద్దుపెట్టుకుంటున్న ప్రకాశంలో సాక్షాత్తూ 'రామం' కనిపించాడు. చిన్నిని నా కందించి మెల్లిగా లోపలికి నడిచాడతను. చెవిలో గలగలమంటున్న చిన్ని గొంతు — ఎదురుగా టీపాయ్‌మీద ఉత్తరం.

'సంధ్యా !'

భగవంతుడిని చూడవలసిన 'చిన్ని'ముఖంలో ఇన్నాళ్లూ 'రామం'ని చూస్తూ నా మూర్ఖత్వంతో నీ మనసు నొప్పించాను. నాకు 'నువ్వు' కావాలి. కాని చిన్ని + నువ్వు = నువ్వు అని తెలుసుకునేందుకెంత ఆలస్యం చేసానో ! రోజూ నా చేతుల్లో మంచుబొమ్మలా — ప్రాణం లేని నువ్వు — నాక్కావలసింది మనసున్న మనిషి. మంచుబొమ్మకాదు. పశువుకూడా ప్రాణంలేని కట్టెతో సరాగమాడదు. 'మాతృహృదయం' త్వరగా గ్రహించేందుకు చిన్నప్పుడు నాకమ్మలేదు సంధ్యా ! నీ అనుమతిలేకుండా నీ డైరీ చదివి 'చిన్ని' అడ్రసు తెలుసుకున్నాను. మన జీవన రాగంలో ఇకమీదుట అపస్వరాలు పలుకవుగా — 'నీ 'ప్రకాశం'.

ఏదో తెలియని రాగం కట్టలు తెంచుకుని నాలో వరదలయ్యింది. లోపల టేప్ రికార్డర్‌లో ప్రకాశం గొంతులో మలయమారుతం మధురంగా వినిపిస్తోంది— 'మనసా ఎటులోర్తునె' ...★